క్లుప్తంగా

కేటీపీపీలో అమరవీరులకు నివాళి



గణపురం: విద్యుత్ అమరవీరుల సంస్మరణం దినోత్సవం సందర్భంగా సోమవారం కేటీపీపీలో శ్రీశైలం అమరవీరులకు ఇంజనీర్లు, ఉద్యోగులు నివాళులర్పించారు. శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రంలో 2020లో జరిగిన ప్రమాదంలో విద్యుత్ కేంద్రాన్ని రక్షించాలన్న సంకల్పంతో పోరాడి మృతి చెందిన అమరులకు కేటీపీపీ సీఈ సిద్ధయ్య ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇంజనీర్ అసోసియేషన్ నాయకులు మాకుల సంతోష్, పుట్ట తిరుపతి, చీకటి నరేష్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రచురణ

మల్హర్ : మండలంలోని 22 పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటరు జాబితాను సోమవారం ప్రచురించినట్లు తహసీల్దార్ వై.శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 20,425 ఓటర్లు ఉన్న జాబితాను ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. వీటిలో పురుషులు 10,173, స్త్రీలు 10,252 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 19 వరకు జాబితా సవరణకు అవకాశం ఉందన్నారు. అక్టోబర్ 2023 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈనెల 26, 27న, సెప్టెంబర్ 2, 3న పోలింగ్ కేంద్రాల్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు అందుబాటులో ఉంటారని, అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేశారు.

ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యం

భూపాలపల్లిరూరల్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా ధర్మసమాజ్ పార్టీ ముందుకెళ్తుందని జిల్లా ధర్మసమాజ్ ప్రచార కమిటీ సభ్యులు కొత్తూరి రవీందర్ అన్నారు. సోమవారం పార్టీ పిలుపు మేరకు స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నియోజకవర్గంలో పాదయాత్ర ప్రారంభించినట్లు రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అయినప్పటికీ 93 శాతం ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ ప్రజల తల రాతలు మారలేదన్నారు. భారత రాజ్యాంగం ద్వారా లభించిన హక్కులను పేదలకు అందించడం కోసం ధర్మ సమాజ్ పార్టీ పోరాటం చేస్తుందని తెలిపారు. పాదయాత్రలో ఉమ్మడి వరంగల్ జిల్లా ధర్మ సమాజ పార్టీ ఇన్‌చార్జ్ సుమన్, నాయకులు రవీందర్, శ్రీనివాస్, మహర్షి, హరీష్, నరసింహ, అశోక్, దశరథం తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమం



భూపాలపల్లి రూరల్ : జిల్లాలోని మిషన్‌భగీరథలో విధులు నిర్వహిస్తున్న 42 మంది సహాయకులకు గణపురం మండలంలోని మిషన్ భగీరథ కార్యాలయంలో సోమవారం భగీరథ పథకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మిషన్‌భగీరథ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో అధికారులు నిర్మల, మధుకుమార్, రమేష్, తదితర ఇంజనీర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మహాముత్తారం: ద్విచక్రవాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని యత్నారం గ్రామానికి చెందిన యాశోదుల శ్రీకాంత్(30) తన బైక్‌పై ఆదివారం రాత్రి యత్నారం నుంచి నిమ్మగూడెం వెళ్తున్న క్రమంలో అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో అదుపుతప్పి పడిపోయాడు. గమనించిన గ్రామస్తులు, కుటుంబసభ్యులకు సమాచారం అందించగా భార్య మానస భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్సై సుధాకర్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మొగుళ్లపల్లి: మండలంలోని పెద్దకోమటిపల్లి గ్రామ శివారులోని సాయి కుంటలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం సోమవారం గ్రామంలో లభ్యమైంది. గ్రామస్తుల కథనం ప్రకారం ఇటీవల వచ్చిన వరదలకు పూడ్చిపెట్టిన శవం కొట్టుకొచ్చింది. గమనించిన సమీప రైతులు గ్రామపంచాయతీకి సమాచారం అందించారు. దీంతో పంచాయతీ సిబ్బంది వెళ్లి పరిశీలించి పూడ్చిపెట్టిన శవం వరదలకు కొట్టుకు వచ్చినట్లుగా నిర్ధారించి ఆదే కుంట ప్రాంతంలో పూడ్చిపెట్టారు.

మరమ్మతుకు నోచని చెరువులు



కోతకు గురైన రుద్రారం ఊరచెరువు



రుద్రారం ఆయకట్టు కింద బీళ్లుగా ఉన్న పొలాలు

- జీళ్లుగా మారుతున్న ఆయకట్టు పొలాలు
- నష్టపోతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

మల్హర్: వర్షాకాలం ప్రారంభం కావడంతో మండలంలోని చెరువులకు, కుంటలకు భారీగా వరద నీరు చేసుకొని జలకళను సంతరించుకుంటుంది. దీంతో ఆయకట్టు రైతులు పొలాలు సిద్ధం చేసుకుంటున్నారు. మరోవైపు చెరువులు మరమ్మతుకు నోచుకోకపోవడం చెరువులో నీరు నిల్వకుండా పోతుంది. ఫలితంగా చెరువుల కింద ఆయకట్టు సాగు ప్రశ్నార్థంగా మారింది. అధికారులు మాత్రం ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు అయ్యాయని మాటలతో సరిపెడుతున్నారు.

చెరువులకు గండ్లు

గత ఏడాది జులైలో కురిసిన భారీ వర్షాలతో మండలంలోని కొండపేట గ్రామపరిధిలోని బొమ్మారపు చెరువు, రుద్రారం ఊర చెరువులకు గండ్లు పడ్డాయి. రుద్రారం ఊరచెరువు ఆయకట్టు కింద సుమారు 150 ఎకరాలు, బొమ్మారపు చెరువు కింద 80 ఎకరాలకు పైగా సాగువుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. భారీ వర్షాలతో చెరువుల గండ్లు పడటంతో వర్షాలు కురిసినా చెరువులో నీరు నిలవ్వడం లేదు. భారీ వర్షాల నేపథ్యంలో రుద్రారం ఊర చెరువు ప్రమాదకరంగా ఉండటంతో అప్పటి తహసీల్దార్ శ్రీనివాస్, ఇరిగేషన్ అధికారులు ఒక్క చోట జేసీబీ సాయంతో గండిని తొలగించారు. వరద ప్రవాహం మరింత పెరగడంతో మరో రెండు చోట్ల చెరువు భారీగా కోతకు గురైంది. ప్రస్తుతం భారీ వర్షాలు కురిసి చెరువులకు నీరు వచ్చినా, వాటిల్లో నిల్వక పోవడంతో మూడు సీజన్లుగా పొలాలు బీళ్లుగా మారతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నిధులేమి కారణంగానే సంవత్సర కాలంగా చెరువులకు పడిన గండ్లను పూడ్చడంలో జాప్యం జరుగుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రుద్రారం ఊర చెరువుకు మరమ్మతులు చేపట్టాలని జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులకు రైతులు వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యుద్ధప్రతిపాదికన మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

బొమ్మారపు చెరువు మరమ్మతులు చేపట్టడానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభిస్తాం. అలాగే రుద్రారం ఊర చెరువు చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో ఉంది. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

-రాజేష్, ఇరిగేషన్ ఏఈ, మల్హర్

సాగుకు దూరమవుతున్నాం



నాకు ఎకరం పొలం ఉంది. గత రెండు సీజనన్లలో చెరువులో నీరు నిల్వక సాగుకు దూరమయ్యాం. ప్రస్తుతం వాన కాలంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్న చెరువులోకి నీరు నిల్వడం లేదు. ఈ సీజన్ కూడా పొలం సాగు చేయని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి చెరువుకు మరమ్మతులు చేపట్టాలి.

- గుమ్మల దేవేందర్, రుద్రారం రైతు, మల్హర్

అధికారులు పట్టించుకోవడం లేదు



రుద్రారం ఊర చెరువుకు మరమ్మతులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. ఆయకట్టు కింద 20 గుంటల పొలం ఉంది. చెరువులో నీళ్లు లేకపోవడంతో పంటను పండించడం లేదు. రూ.30 కోట్ల నిధులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

- అడ్డూరి రాములు, రుద్రారం రైతు, మల్హర్

బాలికల అభ్యున్నతి ప్రతి ఒక్కరి బాధ్యత



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అనూష

కాటారం: బాలికల అభ్యున్నతి ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి వారిని ప్రోత్సహించాలని మిషన్‌శక్తి జెండర్ స్పెషలిస్ట్ అనూష అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని సుందరాజ్‌పేట జెడ్పీహెచ్‌ఎస్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల లింగ నిష్పత్తిలో నిరోధించడం, మహిళా సాధికారతను, బాలికల విద్యను ప్రోత్సహించడానికి ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించినట్లు తెలిపారు. బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలు, ఉమెన్ ట్రాఫికింగ్ గూర్చి వివరించారు. మహిళలు, యువతులు, బాలికలు ఆపద సమయాల్లో 181, 14567, 1098 టోల్ ఫ్రీ నెంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్టు మమత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి



సభలో మాట్లాడుతున్న ఎంపీపీ మల్లారెడ్డి

టేకుమట్ల: అన్ని గ్రామాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఇబ్బందులు తలెత్తకుండా కృషి చేయాలని ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి అన్నారు. సోమవారం మండల సర్వసభ్య సమావేశంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్, మిషన్ భగీరథ అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలను అందించాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో విద్యుత్ సమస్య తలెత్తిందని, దానిని త్వరితగతిన పూర్తి చేసి రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. అలాగే మిషన్ భగీరథ నీళ్లు అన్ని గ్రామాలకు అందించడం లేదని, అందుకు అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో నీటిని అందించాని సూచించారు. అలాగే అన్ని శాఖల అధికారులు సమయ పాలన పాటిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని సూచించారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూతోనే సమస్యల పరిష్కారం



సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఉపాధ్యాయులు

మొగుళ్లపల్లి: విద్యారంగ సమస్యల పరిష్కారం పీఆర్‌టీయుతోనే సాధ్యమని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పలు పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులకు త్వరలో చెల్లింపులు అవుతాయని, ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు చేయడం ,317జీఓ బాధితుల సమస్యల పరిష్కారం, మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలు, కేజీబీవీ ఉపాధ్యాయులకు టైం స్కేల్, పాఠశాలల మౌళిక వసతుల కల్పన తదితర ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి పోలు నాగరాజు, గుండెల్లి రాజయ్య, సామల రమేష్, కృష్ణారెడ్డి, సదానందం, రవీందర్, సాంబయ్య, శ్రీనివాస్, కుమారస్వామి, చంద్రయ్య, రాము పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రం అభివృద్ధి



మాట్లాడుతున్న గోవా ఎమ్మెల్యే ప్రవస్‌యోజన

టేకుమట్ల(రేగొండ): డబుల్ ఇంజన్ సర్కార్‌తో తెలంగాణ అభివృద్ధి సాధ్యమని గోవా బీజేపీ ఎమ్మెల్యే ప్రవస్‌యోజన అన్నారు. సోమవారం రేగొండలో భూపాలపల్లి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి, మండల అధ్యక్షుడు దాసరి తిరుపతిరెడ్డి అధ్యక్షతన శక్తి కేంద్రం ఇన్‌చార్జ్‌లు, బూత్ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ నీళ్లు, నిధులు, నియామకాలు అనే పునాదిపై సబ్బండ వర్గాల ప్రజల ఆకాంక్షతో ఏర్పడ్డ తెలంగాణ నేడు కుటుంబ పాలనలో చిక్కుందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యుగదీశ్వర్, శిల్పారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగపూరి రాజమౌళి గౌడ్, వెన్నంపల్లి పాపన్న, రాంచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నిశీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రసాద్‌రావు, తిరుపతిరావు, మనోహర్, అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని యువకుడి మృతి

కాటారం : బొగ్గు టిప్పర్ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని బస్వాపూర్ సమీపంలో 353వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మహాముత్తారం మండలంలోని ఉట్లపల్లి గ్రామానికి చెందిన బీసుల పోశయ్య(45), గాదె సుశాంత్ ద్విచక్ర వాహనంపై భూపాలపల్లి వైపు వెళ్తుండగా బొగ్గు టిప్పర్ వెనుక నుంచి బైక్‌ను అతివేగంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న పోశయ్య కింద పడడంతో టిప్పర్ అతడి మీది నుంచే వెళ్లింది. దీంతో అతడి శరీర భాగాలు తునాతునకలై రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. సుశాంత్ స్వల్పగాయాల పాలయ్యాడు. ఎస్సై అభినవ్ ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడి శరీర భాగాలను పోస్టుమార్టం నిమిత్తం మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

సాక్షి స్పందన

మహాముత్తారం: ఇటీవల కురిసిన వర్షానికి మండలంలోని నల్లగుంట– మీనాజీపేట నర్సింగాపూర్ వెళ్లే ప్రధాన రహదారి కోతకు గురైంది. దీంతో సోమవారం 'సాక్షి'లో ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా? అని కథనం ప్రచురించింది. కథనానికి స్పందించిన మీనాజీపేట సర్పంచ్ ముత్యాల రాజు సోమవారం కోతకుగురైన ప్రధానరహదారిని మట్టిపోసి పూడ్చివేశారు. వార్త ప్రచురించి సమస్యను పరిష్కరించినందుకు 'సాక్షి'కి నర్సింగాపూర్, మీనాజీపేట గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

'ఉపాధి' పనులు పారదర్శకంగా నిర్వహించాలి



వివరాలు వెల్లడిస్తున్న సామాజిక తనిఖీ బృందం

కాటారం: గ్రామాల్లో వలసలు తగ్గించి స్థానికంగా ప్రజలకు పని కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ఉపాధిహామీ పథకం దుర్వినియోగం కాకుండా పనులు పారదర్శకంగా నిర్వహించాలని అడిషనల్ డీఆర్‌డీఓ అవినాష్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఉపాధి పథకం 13వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. 1 జూలై 2021 నుంచి 31 మార్చి 2023 వరకు మండలంలో రూ.8.86 కోట్లతో చేపట్టిన ఉపాధి అభివృద్ధి పనులపై పది రోజుల పాటు సామాజిక తనిఖీ బృందాలు గ్రామపంచాయతీల వారిగా తనిఖీలు చేపట్టాయి. గ్రామసభలు నిర్వహించి తయారు చేసిన తనిఖీ నివేదికలను ప్రజావేదికలో చదివి వినిపించారు. మండలంలోని పలు గ్రామపంచాయితీల్లో పంచాయితీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సుమారు రూ. 80 లక్షలకు సంబంధించిన సీసీ రోడ్లు, ప్రహరీల నిర్మాణాలకు సంబంధించిన రికార్డులను సంబంధిత ఏఈఈ తనిఖీ బృందాలకు అందజేయలేదు. దీంతో ప్రజావేదికలో అడిషనల్ డీఆర్‌డీఓ పీఆర్‌ఎస్‌ఈకి రెఫర్ చేశారు. పలు గ్రామపంచాయతీల్లో హరితహారంలో భాగంగా నాటిన మొక్కల లెక్క, వాటి సంరక్షణ చర్యలు సక్రమంగా లేవని తనిఖీ బృందాలు గుర్తించగా సంబంధిత అధికారులకు జరిమానా విధించారు. నస్తూర్‌పల్లి, గంగారం, చిద్నెపల్లి గ్రామపంచాయతీల్లో గత ఆరు నెలల క్రితం పనులు చేసిన కూలీలకు డబ్బుల చెల్లింపుల్లో ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది జాప్యం వహించినట్లు తనిఖీ బృందాలు వెల్లడించగా వెంటనే చెల్లింపులు చేయాలని అడిషనల్ డీఆర్‌డీఓ ఆదేశించారు. గ్రామపంచాయతీల్లో మస్టర్లపై కూలీల సంతకాలు లేకుండా కూలీ డబ్బులు చెల్లించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాజిక తనిఖీ ద్వారా 12 గ్రామపంచాయతీలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు రూ.26,618, టెక్నికల్ అసిస్టెంట్లకు రూ.14,034, కంప్యూటర్ ఆపరేటర్‌కు రూ.1000, ఇతరులకు రూ.43,252 మొత్తం రూ. 85వేలు జరిమానా విధించి సంబంధిత అధికారుల నుంచి రికవరీ చేయనున్నట్లు అడిషనల్ డీఆర్‌డీఓ తెలిపారు. సమావేశంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, డివిసి రుబీనా, అంబుడ్స్‌మెన్ శ్రీనివాస్, క్యూసి ధరంసింగ్, ఎస్టీఎం అంజయ్యగౌడ్, ఎస్సార్పీ మహేందర్, ఎంపీడీఓలు శంకర్‌నాయక్, ఆంజనేయులు, ఏపీఓ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

నాగుల పంచమి వేడుకలు



గణపురం : పుట్టలో పాలు పోస్తున్న మహిళలు



మొగుళ్లపల్లి : దర్శనం కోసం క్యూలో మహిళలు

గణపురం : నాగుల పంచమి సహిత శ్రావణ మొదటి సోమవారం కావడంతో మండలంలోని ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. నాగుల పంచమి, శ్రావణ సోమవారం కావడంతో శివాలయాలకు భక్తులు ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో చేరుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఉన్న పుట్టల్లో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. మండలకేంద్రంలోని కాకతీయుల కళాక్షేత్రం కోటగుళ్ళు, బుద్ధారం గ్రామంలోని పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయం, చెల్పూరులోని సాంబశివ ఆలయంతో పాటు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం నాగుల పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయ ప్రాంగణంలోని పుట్టలో పాలు పోసి, నాగమయ్యకు ప్రత్యేక మొక్కులు చెల్లించారు. పలు ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో హాజరై నాగుల పంచమి వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఈఓ బిల్ల శ్రీనివాస్, చైర్మన్ మాదాడి అనితకరుణాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని పిడిసిల్ల శివారు ఎల్లారెడ్డిపల్లె గ్రామంలోని నాగదేవత దేవాలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టలో పాలు పోసి మొక్కులు సమర్పించారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న డీటీఎఫ్ నాయకులు

టేకుమట్ల: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఇప్పకాయల వీరేశం అన్నారు. సోమవారం మండలంలోని పలు పాఠశాలల్లో డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంతో పాటు, 5వ విద్యా వైజ్ఞానిక రాష్ట్ర సదస్సుకు విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టకపోవడంతో విద్య కుంటు పడుతుందన్నారు. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే ప్రకటించి డీఎస్సీ ద్వారా ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి ఇంద్రగోపాల్, ఉపాధ్యాయులు జ్యోతి, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల సంబురాలు



సంబురాలు జరుపుకుంటున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

టేకుమట్ల/రేగొండ/గోరికొత్తపల్లి: ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి బీఆర్‌ఎస్ భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేగా సోమవారం టికెట్ ఖరారు కావడంతో ఆయా మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమాల్లో టేకుమట్ల ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, రేగొండ జెడ్పీటీసీ సాయిని విజయ, ఆయా మండలాల అధ్యక్షులు సట్ల రవి, అంకం రాజేందర్, మటిక సంతోష్, సాంబారి సాయికుమార్ పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆరెపల్లి మల్లయ్య ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శి మెరుగు సంపత్ కుమార్, సర్పంచ్‌ల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి సిద్దంకి భాస్కర్, మండల ఉపాధ్యక్షులు తిరుపతి గౌడ్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు రవీందర్‌రావు, పిఏ సీఎస్ చైర్మన్ గణపతి, ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షులు తిరుపతి, సర్పంచ్ పూర్ణచందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలో సంబరాలు చేసుకున్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతిరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమన్నారు.

గణపురం : ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డికి మరోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా సీఎం కేసీఆర్ ప్రకటించడాన్ని హర్షిస్తూ గణపురం మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ మండలశాఖ ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహారావు,పీఎసిఎస్ చైర్మన్ పూర్ణచంద్రా రెడ్డి, సర్పంచ్ పాల్గొన్నారు.

'పుట్ట'కు టికెట్ కేటాయింపుపై సంబరాలు

మహాముత్తారం: బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పుట్ట మధును ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడం పట్ల మండలంలోని యామన్‌పల్లి ప్రధాన కూడలి వద్ద బీఆర్‌ఎస్ నాయకులు టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజు, మహాముత్తారం ఎంపీటీసీ శ్రీపతి సురేష్, మాజీ ఎంపీటీసీ రాము, యూత్ అధ్యక్షుడు జైపాల్‌నాయక్, పాల్గొన్నారు.

కాటారం: బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పుట్ట మధును ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు తోట జనార్దన్, యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, ఎంపీటీసీ బాసాని రవి, సర్పంచ్ రాజమౌళి, ఊర వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

మల్హర్: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టికెట్ కేటాయింపుతో సంబరాలు

మహదేవపూర్: పుట్ట మధుకు టికెట్ కేటాయించడంతో సోమవారం కార్యకర్తలు నాయకులు సంబురాలు చేసుకున్నారు. శ్రీనివాసరావు, సర్పంచ్ శ్రీపతి బాపు, మనోహర్, శ్రీహరి, రాకేష్, లక్ష్మారెడ్డి, గీత బాయి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.



గోరికొత్తపల్లిలో...



మహాముత్తారంలో...



మల్హర్ : నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత



స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులతో కంపెనీ సిబ్బంది

చిట్యాల: నిరుపేద రైతు కుటుంబాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు బయో స్టార్ కంపెనీ నుంచి చిట్యాల డిస్ట్రిబ్యూటర్ పువ్వాటి హరికృష్ణ, కంపెనీ మేనేజర్ పిట్ట లక్ష్మన్ ఆధ్వర్యంలో సోమవారం స్కాలర్‌షిప్‌లు అందజేశారు. మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ. 2500 చొప్పున పది మందికి అందించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కంపెనీ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ రాకేష్, పూర్ణ చందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.